
## కోమలాదేవి



# అమృత హృదయాలు

అది చిన్న అందమైన అధునాతనంగా కట్టబడిన ఇల్లు.

కానీ తోట చాల పెద్దదిలా ఉంది.

గేటు ముందు నుంచుని చూస్తే దారికి ఇటు అటు సిపాయిల్లా నుంచున్నట్లున్న అశోకవృక్షాలు ఎంతో దూరంవరకు కనిపిస్తాయి. మరి గేటులోపలికెళ్ళ టానికి వీల్లేకుండా హేడ్స్ (పాతాళ లోకం)ను కాపలాకాచే మూడు తలల కుక్కకన్నా భయంకరమైన గూర్ఖా లాఠీతోకాక బందోక్‌నే భుజానికి వ్రేలా డేసుకుని నుంచున్నాడు.

పాపం రాజయ్య మేష్టారు గూర్ఖాను చూచి తక్కున ఆగిపోయాడు. అటు ఇటు తిరిగాడు. చీమకూడా దూరడానికి వీలులేదు. అన్నట్లు అతగాడు జాగరూ కతతో నలుమూలలా దృష్టి సారిస్తూ జాగ్రత్తగా ఉన్నాడు. సినిమాలలో కాపలావాణ్ణి మోసంచేసి వెళ్ళటం ఎంతో సులభంగా చూపిస్తారు. కాని నిజజీవి తంలో ఆ కాపలావాడు నీ అంతు కను క్కునిగాని విడువడు.

లాభంలేదు. నోరు విప్పాలి. ఇలా పదార్లుచేస్తే ఏ పనీ కాదు. దగ్గరకు వెళ్ళాడు. గూర్ఖా మరికాస్త తిన్నగా నుంచున్నా ఐదడుగులకన్నా మించలేదు. ఐతేమాత్రమేం, అతణ్ణిదాటి లోపలికెళ్ళే ధైర్యం ఎవరికీ ఉండదు. అంత ఠీవిగా అంత మెళకువగా – నుంచున్నాడు. రాజయ్యను పరీక్షగా చూస్తున్నాడు.

"అయ్యగారున్నారా బాబూ."

"తెలీదు"-ఇటువంటివారికి ఇలాంటి జవాబు ఇవ్వటం అలవాటు చేసుకున్నాడా మనిషి.

"కనుక్కుంటారా బాబూ."

"వీల్లేదు."

"చాలా దూరంనించి వచ్చాను. చూచి వెళ్ళిపోతాను."

"ఐతే ఆ పక్కగా నిల్చో." ఆజ్ఞా పించాడు.

"కొంచెం మాట్లాడాలి."

"వీల్లేదు."

"అయ్యగారి ఊరునించి వచ్చాను. ఒక్కమాట మాట్లాడి వెళ్తాను. దయదల్చి పోనియ్యి బాబూ."

"ఏదన్నా కష్టం చెప్పుకుంటానంటే ఆఫీసుకాడి కెల్లు. ఇక్కడ అట్టాంటివి ఒప్పుకోరు."

రాజయ్య ముఖంలో నిరాశ చోటు చేసుకున్నది. ఆకలి – అలసట – దీర్ఘ ప్రయాణం తాలూకు నిద్రలేమి అతణ్ణి కృంగదీస్తున్నాయి. మరి మాట్లాడలేక కాస్త ప్రక్కకువెళ్ళి పేవ్‌మెంట్ చివర చతికిలబడ్డాడు.

"నువ్వాడ కూర్చోరాదు. దూరంగా పో."

అతడు వినిపించుకోలేదు.

ఎందుకో అతణ్ణి చూస్తుంటే గూర్ఖాకు జాలేసింది.

కాని నిస్సహాయుడు. తన రూల్స్ తనకున్నాయి.

కాసేపు ఆగి రాజయ్య మళ్ళీ వచ్చాడు.

"పోనీ ఉత్తరం లోపలికి పంపుతావా బాబూ. నాకెవ్వరూలేరు. ఏ సిఫార్సు కోసమూ రాలేదు. డబ్బుకోసం రాలేదు. వారినించి ఏ విధమైన సహాయం నా కక్కరలేదు. చిన్ననాటినించి ఎరుగుదును. ఇంత దూరంవచ్చి చూడకండా వెళ్ళటానికి మనసొప్పటంలేదు. దయచేసి ఈ ఉత్తరం లోపలికి పంపితే..." రెండుచేతులెత్తి దండం పెట్టాడు.

గూర్ఖా ఉత్తరాన్ని అందుకున్నాడు. అందులో ఏ లెటర్‌బాంబులు లేవని నిర్ధారణ చేసుకున్నాడు.

గేట్ తెరచి సన్నగా విజిల్ వేశాడు.

"భౌ-భౌ" మంటూ అల్‌షిషన్ కుక్క పరుగులమీద వచ్చింది. గేటు దాటి తనమీద పడ్తుందేమోనని భయం భయంగా దూరంగా వెళ్లాడు రాజయ్య.

కానీ కుక్క రాజయ్యనుచూచి కోపంతో భౌ-భౌ మని అరవలేదు. తోకాడిస్తూ సౌమ్యంగా ఉన్నట్లుంది. గూర్ఖాకు ఆశ్చర్యంవేసింది. దానినోటిలో ఉత్తరం ఉంచాడు.

కుక్క పరుగెత్తి లోపలికెళ్ళిపోయింది.

గంట-రెండు గంటలు దాటిపోయాయి. ఏమీ జరుగలేదు.

సంచిలోనించితీసి రెండు అరిటిపండ్లు తిని గూర్ఖా కూజాలో నీళ్లుత్రాగి నీడ పట్టున కూర్చున్నాడు.

ఇంతలో కారు హార్న్ వినబడింది. గూర్ఖా ఆత్రంగాలేచి గేట్ తీశాడు. రాజయ్య గబగబా వచ్చాడు, 'అయ్యగారు' వచ్చారేమోనని.

అయ్యగారుకాదు-అందులో కూర్చున్నది 'అమ్మగారు,' రెండేళ్లబాబు. వారివైపు ఆతృతతో చూచాడు.

ఆమె ఎంతో అందంగా ఉంది. నాజూకుగా ఉంది. ఆ పిల్లవాడు ముద్దుగా ఆరోగ్యంగా ఉన్నాడు.

రాజయ్య కారుకు మరీ దగ్గరగా వచ్చాడు. అదనుదొరికింది.మాట్లాడాడు- "అయ్యగార్ని చూడాలనివచ్చాను తల్లీ." ఆమె భృకుటికరించి అతడివైపు చూసింది. అతణ్ణి ఎక్కడో చూచినట్లుంది. ఆ నొసలు - ఆ ముక్కు - ఆ గెడ్డం-ఆ స్వరం-సుపరిచితంలా ఉంది. ఎక్కడ-ఎక్కడ చూచింది. డ్రైవర్ వేగాన్ని హెచ్చించబోయాడు.

"ఆపు."

కారు ఆగిపోయింది.

ఆమె అతణ్ణి చూస్తోంది. కానీ పోల్చుకోలేకపోతోంది.

"అయ్యగారు కాంప్‌కెళ్ళారు"

"అయ్యో" ఆ కంఠంలో ధ్వనించిన నిరాశకు ఆమె విస్తుపోయింది.

"మీకు ఇక్కడ మరెవరూ లేరా?"

"లేరు తల్లీ."

"భోంచేశారా?"

"ఏదో తిన్నానులెండి.''

ఆమె గూర్ఖాతో అంది "వీరిని తోట లోపల ఇంట్లో ఉంచు. నాయర్‌కు చెప్పి భోజనం పెట్టించు. జాగ్రత్త."

అంటే-అతణ్ణి కనిపెట్టి ఉండమని హెచ్చరింపు.

కారు వెళ్ళిపోయింది.

ఆ కారు వెళ్ళినవైపుచూస్తూనుంచుండిపోయాడు రాజయ్య.

"పదయ్యా-పద" అంటూ గూర్ఖా గేటుతీసి లోపలికి పంపిస్తూ మరొకర్ని పిల్చి రాజయ్యను అప్పగించి భోజనం పెట్టించమని చెప్పి మళ్ళీ గేటు మూసేశాడు.

''అమ్మగారు మంచివారులాగానే ఉన్నారు." రాజయ్య అన్నాడు.

నౌకరు ఏం మాట్లాడలేదు.

తోట ఇల్లు తాళంతీశాడు. అన్నీ ఉన్నాయి. స్నానంచేసి పడుకున్నాడు. ఇంతలో అతడు కేరేజి తెచ్చిపెట్టి వెళ్ళిపోయాడు. రాజయ్య అరటాకులోవడ్డించుకుని భోంచేసి నిద్రపోయాడు.

సాయంత్రం ఎన్నిగంటలైందో - ఎవరో లేపుతుంటే లేచి కూర్చున్నాడు. ఎంతో హాయిగా ఉంది ప్రాణం. సేద తీరింది.

''అమ్మగారు పిలుస్తున్నారు,'' అని చెప్పగానే లేచి గుడ్డలు సరిచేసుకుని అతడివెంట వెళ్ళాడు.

డ్రాయింగ్ రూం దాటి లోపలికి తీసుకెళ్తుంటే అతడి హృదయం గుబగుబలాడింది. అయ్యగార్ని చూస్తాడేమో!

అది ఆఫీస్ కమ్ రీడింగ్ రూం కాబోలు-విశాలంగా ఉంది. మూడు సెట్లు సోఫాలు మూడు మూలల్లో ఉన్నాయి. వేజ్‌లలో ఏస్టర్స్‌ని అందంగా అమర్చారు. ఒక మూల ఆఫీస్ టేబుల్, ఫైల్‌కాబినెట్, రెండు పుస్తకాల బీరువాలు ఉన్నాయి. కిటికీ దగ్గర ఎత్తైన స్టాండ్‌మీద అడుగు ఎత్తులో ఉన్న వీనస్ డి మెలో పాలరాతి శిల్పం ఆ సాయంసమయం నీరెండను సుతారంగా వన్నెలు చిందిస్తోంది.

అమ్మగారు ఒక కిటికీదగ్గర నిలబడి ఉంది.

వారిద్దరే ఆ గదిలో మిగిలిపోయారు.

''కూర్చోండి"

సోఫా మలిన మైపోతుందేమో-అన్నట్లు అంచుకు కూర్చున్నాడు.

"సరిగా కూర్చోండి"

కాఫీ పాట్‌లోంచి కాఫీ ఒంపి అతడికొక కప్పు కాఫీ అందించింది.

రాజయ్య మౌనంగా త్రాగి కప్పు టీపాయ్ మీద పెట్టాడు.

''మీ పేరేమిటి తల్లీ?"

"స్వర్ణలత అంటారు. ఇక చెప్పండి. వారు లేరు. మూడు రోజులకుగాని రారు. మీకేం కావాలి? మీ రెవరు? ఎందు కొచ్చారు?"

"కూర్చోమ్మా."


"ఫరవాలేదు," ఆమె కిటికీని ఆనుకుని నుంచుంది.

"నాగురించి చెప్పమంటారా అమ్మా? ఏముంటుంది. నాలాంటి పేదవాడి కథలన్నీ ఒకేలా ఉంటాయి. లేమిలో పుట్టి-కష్టాల్లో పెరిగి-దుఃఖంలో అంతమయ్యే జీవితంలో ప్రత్యేకంగా చెప్పుకోదగిన సంఘటన లేముంటాయమ్మా?"

"నిజమే. ఏమీ ఉండవనే అనుకుందాం. చూస్తే మీరు పేదగా కనిపిస్తున్నారు. అయ్యగార్ని చూచి వెళ్ళిపోతానంటున్నారు. ఇంతదూరం ఎందుకొచ్చారు? వారిని చూడటానికేనా? అందుకే అడుగుతున్నాను."

రాజయ్య మహా ఇబ్బందిలోపడిపోతూ సోఫాలో సర్దుకుని కూర్చున్నాడు.

"మాది విశాఖపట్నంజిల్లా కుగ్రామం. అదే అయ్యగారి గ్రామమే. నేను వీధిబడి మేష్టార్ని. జీతంరాళ్లతో ఇల్లు గడవదు. శిష్యుల తలిదండ్రులు దయదల్చి పాలు-పెరుగు-కూరగాయలు ఇస్తే అలా సంసారం లాక్కొచ్చేవాడిని. నా కొక కూతురు. ఒక కొడుకు. అమ్మాయికి పదిహేనేళ్లు రాగానే పెళ్ళిజేశాను. నా భార్య వారి చిన్నతనంలోనే పోయింది. తల్లీ తండ్రీ నేనే అయి పెంచాను. అందుకని కూతురు నా కళ్ళఎదుట ఉండాలని ఎంతో కష్టపడి కట్టుకున్న ఇల్లు అల్లుడికి కూతురికి ఇచ్చి ఓ గదిలో నివసిస్తుండేవాడిని. ఒక్క సంవత్సరం ఊరుకున్నారు. ఆ తర్వాత అల్లుడు గది ఖాళీచెయ్యమని పోరుపెట్టటం ప్రారంభించాడు. అమ్మాయి మొదట్లో ఊరుకుంది. నాలుగేళ్లు ఎలాగో గడిపాను. ఆ తర్వాత ఉన్నట్లుండి ఒకనాడు 'నాన్నా నువ్విక్కడున్నందుకు నాకూ ఆయనకూ ప్రతిరోజూ పోట్లాటవస్తోంది, నువ్వు వెళ్ళిపోనాన్నా' అంది. వారికింకా మూడుగదులున్నాయి. పై ఆదాయమంతా వారికే ఇచ్చేవాడిని. కూతురు-ఈ చేతులతో అల్లారిముద్దుగా పెంచిన కూతురు నన్నా ఇంట్లోనించి తరిమివేస్తుందని కలలోకూడా వూహించలేదు నేను. భర్తకు సర్దిచెబుతుం దనుకున్నాను. అమ్మాయి గట్టిగా పట్టుబట్టి ఉంటే అల్లుడు కిమ్మనకుండా వూరుకునేవాడు. అతడి స్వభావం నాకు తెలుసు. అమ్మాయి నోటినించి ఆ మాట రాగానే ఇక అక్కడ ఉండాలనిపించలేదు. నా శక్తినంతా ఎవరో పీల్చివేసినలా అయిపోయాను. స్నేహితులచేతగాని, ఊరిపెద్దలచేతగాని చెప్పించాలనిపించలేదు. మునుపు చెప్పించేవాడిని. అల్లుడు అయిష్టంగానే నన్నుండనిచ్చాడు. కానీ ఆనాడు ఆమె కూతురే కాదనుకుని సామాను సర్దుకుని ఊరి దేవాలయపు మండపం జేరాను. అక్కడికి నా దగ్గర చదువుకున్నవారంతా వచ్చి బడిలోనే ఉండమని చెప్పారు. అలాంటి కూతుర్ని కన్నందుకు ఎంత సిగ్గుపడిపోతున్నానో చెప్పలేను." అతడు అవుజేసి కన్నీళ్లు ఒత్తుకున్నాడు.




"కొడుకు సంగతి చెప్పలేదు మీరు."

"ఔనమ్మా. ఒక కొడుకు. అమ్మాయికన్నా మూడేళ్లు పెద్ద. చాల తెలివిగలవాడు. ఐదోక్లాసయ్యాక విశాఖపట్నంలో మా చెల్లెలు దగ్గరుంచి చదివించాను. చాల బుద్ధిగా చదువుకున్నాడు. ఇంటరు పాసయ్యాడమ్మా. ఆ తరువాత ఏంబుద్ధిపుట్టిందో-ఎటో వెళ్ళిపోయాడు. మరి నాకు కనిపించలేదు. కళ్లెదుట ఉండి కనబడని కూతురు-అసలు కనబడని కొడుకు వీళ్ళనమ్మా నేను కన్నది. రెండేళ్ళక్రితం రిటైర్ అయ్యాను. ఉండటానికి స్థలంలేదు. అప్పుడు జ్ఞాపకం వచ్చింది. పత్రాలు చూస్తే మా అమ్మాయికి రాసిచ్చిన ఇంటివెనుక భాగంలో ఇరవై చదరపు గజాల ఖాళీ స్థలం ఉంది. అది ఇచ్చినట్టుగా అందులో లేదు. వారే గుడిసెవేసి అద్దెకిచ్చారు. నా స్టూడెంటే తాహసిల్దార్ అయి వచ్చి ఆ స్థలం నా కొచ్చేలా చేశాడు. అక్కడ చిన్న గుడిసె వేసిచ్చాడు. అందులో ఉంటున్నాను. కన్నకొడుకులా నన్ను చూచుకున్నాడు. ఏడాది క్రితం ఇక్కడికి ప్రమోషన్‌మీద ట్రాన్స్‌ఫర్ అయి వచ్చారు. వచ్చిన నెలరోజులుండి వెళ్ళమని ఒకటే పట్టుబట్టారు. పనిమీద అటు వేపుకువచ్చి నన్ను తప్పక రావాలని

బలవంతం చేశారు. అందుకే వచ్చాను. తహసిల్దారూ మీ బాబుగారు కలసి చదువుకున్నారమ్మా. ఆ రోజుల్లో నేనంటే ఎంత గౌరవం - ఎంత అపేక్ష. అంతే కాదమ్మా. మా అబ్బాయి మీ బాబూ విశాఖపట్నంలో కలిసి చదువుకున్నారు. ఏమైనా మా అబ్బాయిని గూర్చి న కబురు చెబుతారేమోనని వచ్చాను."

లత విశాలనేత్రాలలో కన్నీటి పొరలు క్రమ్ముకున్నాయి.

''పాపం-ఒక తండ్రి" అనుకుంది, పారిపోయిన ఆ కొడుకును, కళ్లెదుట ఉండి కనబడని కూతుర్ని గూర్చి తలస్తూ నుంచుంది. అప్పుడప్పుడు ఆమె కళ్ళు తుడుచుకోవటం అతడు గమనించాడు.

"ఎందుకమ్మా మీ రేడుస్తున్నారు? నాలాంటి అభాగ్యులైన తలిదండ్రులెందరో ఉన్నారమ్మా."

"నన్ను మన్నించకండి. మీరు పెద్దలు. మీరన్నమాట నిజమే. తమ సంతానంవల్ల సుఖపడని తలిదండ్రులున్నారు. కానీ మీ లాంటి పరిస్థితుల్లో చిక్కుకున్నవారు కొందరే ఉంటారు."

"అమ్మా నిలబడే ఉన్నారు."

"ఫరవాలేదు."

ఫోన్ రింగయింది. అందుకుని

"లతా హియర్ అంది." అవతలివారేదో మాట్లాడారు. జవాబుగా లతా అంది "నో.నో ... ముఖ్యమైన పార్టీ కాకపోతే నన్ను మన్నించండి. నేను రాలేను. మరేమనుకోవద్దు...థాంక్యూ" అని పెట్టేసింది.

రాజయ్య విస్తుపోయాడు. ఎలాంటి వ్యక్తి ఈమె? తనతో మాట్లాడుతూ బిజీగా ఉన్నానటూందే! పెద్ద ఆఫీసరు భార్య - ఎన్నో పార్టీలు - ఫంక్షన్‌లు ఉంటాయి. అన్నింటికీ హాజరుకావాలి. అలాంటి వ్యక్తి వెళ్ళకుండా మానుకుంటోంది! తనకోసమా? తనెవరు-తన తాహతేమిటి తన అంతస్తేమిటి?

ఆమె మళ్ళీ కిటికీకి అనుకుని నుంచుంది.

"అమ్మా మీరెక్కడికో వెళ్ళాలి కాబోలు. సెలవిప్పిస్తే..."

"లేదు. లేదు. నే నెక్కడికీ వెళ్లటం లేదు. మరోమారు వేడుకుంటున్నాను. నన్ను మన్నించకండి. చిన్నదాన్ని-మీ శిష్యుడి భార్యను. నన్ను మన్నించటం తగదు...అన్నట్లు ఆ తహసిల్దారుగారు భాస్కర్రావుగారు కాదుగదా."

"వారేనమ్మా. వారే..." ఎంతో ఆనందపడిపోతూ అన్నాం.

"వారు మా ఫామిలీ ఫ్రెండ్! అంటే వారి కుటుంబానికి-మా తండ్రిగార్కి, మా అమ్మగారి కుటుంబానికి చాల స్నేహం."

"అమ్మా! మీ విషయాలు చెప్పారు కాదు. పిల్ల లెంతమంది. మీ పుట్టిల్లేది? నాన్నగారేం జేస్తారు? ఇక్కడికొచ్చి ఎన్నాళ్లైంది?"

లత నవ్వుకుంది. ఎంత చక్కగా ప్రశ్నిస్తున్నాడు—

"మా పెళ్ళయి ఆరేళ్లయింది. పెద్దమ్మాయి ప్రేమలతకు నాలుగేళ్ళే. బాబు అనితాను మీరు చూచారు. మాది కాకినాడ. నాన్నగారు ఢిల్లీలో ఉంటారు. హోమ్ మినిస్ట్రీలో ఒక సెక్రెటరీగా ఉన్నారు."

"అలాగమ్మా, చాల సంతోషం." నిజంగానే ఆ సంతోషం ముడతలుపడిన ఆ ముఖంలో ప్రస్ఫుటమైంది.

"పాప ఎక్కడుందమ్మా?"

"ఇక్కడే ఉంది," అంటూ ఆమె వెళ్ళి పాపను తీసుకొని వచ్చింది. పాపతోపాటు కుక్కగూడ వచ్చింది.

అది భౌమంటూ అమాంతంగా రాజయ్య మీదికి ఉరకలేదు. దాన్ని అదుపులో పెట్టాలనుకుని తయారుగా ఉన్న లత దాని వింతచర్యకు ఆశ్చర్యపోతూ చూచింది.

చిటికేసి పిల్చాడు.

"కుక్కలంటే నాకు ప్రాణమమ్మా"

ఆమె మాట్లాడలేదు. కుక్కను గమనించి చూస్తోంది. అది అతడిదగ్గర కూర్చుని తోకాడిస్తూ మౌనంగా ఉంది!

రాజయ్య పాపను పిల్చాడు. బెరుగ్గా తల్లివైపు చూచింది.

''వెళ్లమ్మా. నమస్కారం చెయ్యి. తాతగారు" దగ్గరకు నడిపించుకుని తెచ్చింది.

పాప నమస్కరిస్తుంటే ఆశీర్వదించాడు. ఆ ఆశీర్వాదం హృదయాంతరంలోంచి వచ్చింది. పాపను ప్రక్కన కూర్చుండబెట్టుకున్నాడు.

"వారు వచ్చేవరకు మీరు ఇక్కడే ఉండండి. తోట ఇంట్లో మీకు వసతిగానే ఉందికదూ? మీరు వారి గురువులు. ఇక్కడికే వచ్చి భోంచెయ్యండి."

''ఎందుకమ్మా ఆ శ్రమ."

"శ్రమేం లేదు. ఏడున్నరకంతా పిల్లలతోపాటు మీరు భోంచెయ్యండి. మీరు కబుర్లు చెప్పుకుంటూ ఉండండి. నేను వస్తాను."

ఆమె వెళ్ళిపోయింది.

రాజయ్య అనుకున్నాడు, ఎంత మంచి అమ్మాయి. ఎంత అణకువ-ఎంత మర్యాద. ఎంతటి హృదయ ఔనత్యం!

పాపను ఏవేవో ప్రశ్నలువేస్తూ ఆమె జవాబులను వింటూ ఆనందిస్తున్నాడు రాజయ్య.

ఆ తర్వాత బాబు వచ్చాడు. ముగ్గురూ కలసి ఏవో కబుర్లలో పడ్డారు. రాజయ్య చిన్న చిన్న కథలు చెప్పాడు. పిల్లలు మహదానందంతో వింటున్నారు.

మూడురోజులు గడిచిపోయాయి.

నాలుగవరోజు పాప పెద్ద ప్యాకెట్ తెచ్చి అందిస్తూ అంది "అమ్మ మీకిమ్మంది."

రాజయ్య ఆత్రంగా తెరిచి చూచాడు. పంచలచాపు జరీ కండువా, రెండు లాల్చీలున్నాయి.

వాటిని చూస్తుంటే కళ్లు చెమర్చాయి. "నా కెందుకమ్మా ఇవి." పాపతో అన్నాడు. చక్రాలాంటి కళ్లతో ఆశ్చర్యంతో అంది. "కట్టుకోటానికి" పాప జవాబుకు ముచ్చటపడి-నవ్వుతూ పాపను దగ్గరికి తీసుకున్నాడు.

నాలుగవరోజు ఇంట్లో సందడిగా ఉంది.

అయ్యగారు-అదే - తన శిష్యుడు-మిస్టర్ సదన్ వచ్చినట్లు గుర్తించాడు. తనకు తెలిసినపేరు మధుసూదన్. దాన్ని సులభంగా చేసిపారేశాడు-సదన్ అని.

వెంటనే వెళ్లి కలుసుకోవాలన్న ఆత్రాన్ని అతికష్టంతో అదుపులో పెట్టుకున్నాడు. విధిలేక ఆ తోటఇంట్లో ఒంటరిగా కూర్చుండిపోయాడు.

సదన్ భోంచేసి భార్యతో బెడ్ రూంలో కూర్చున్నాడు.

ప్లేన్ ప్రయాణం. అలసినట్లులేదు. లతచేతితో ఆడుకుంటూ ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

"ఏమిటి విశేషాలు?" మామూలుగానే అడిగాడు.


''ఏమీలేవు'' అంటూనే బోలెడన్ని కబుర్లు చెబుతుంది లత.

ఈమారుకూడా అలాగే - అనుకుని వినటానికి తయారయి-ఆమె ఒడిలో తలపెట్టుకుని ''ఊఁ- చెప్పు'' అన్నాడు.

"నాల్గురోజులక్రితం మీ కోసం ఎవరో వచ్చారు. ఒక ఉత్తర మిచ్చారు. మీ స్వగ్రామమనించట".

సదన్ చటుక్కునలేచి కూర్చున్నాడు. "ఏదీ ఉత్తరం" అన్నాడు. అతడిలో కల్గిన మార్పుకు-ఆ కంఠంలోని కంపనకు లత ఆశ్చర్యపోయింది.

ఆమె వెళ్లి డ్రాయర్‌లాగి ఒక కాగితం పట్టుకొచ్చింది.




"ఎవరబ్బా! కనీసం కవర్లోనైనా పెట్టలేదు" అంటూ విసుక్కుని లేఖ అందుకున్నాడు. ఎంత ప్రయత్నించినా అతడి చేతుల్ని కంపించకుండా చేయలేకపోయాడు. లత గమనిస్తూనే ఉంది. వింతగా చూస్తూనే ఉంది.

లేఖను చదవటానికి నిమిషం కూడా పట్టలేదు. సదన్ ముఖంలో అంతవరకు తాండవంచేసిన భయాందోళనలు పటాపంచలైనై. ముఖం నిర్మలమైంది. ప్రశాంతంగా చూస్తూ కూర్చున్నాడు.

"ఆ ... ఎందుకో ఇలాంటివారు! నన్ను చూడటానికి వచ్చాట్ట ఎందుకో?" కనుబొమలు చిట్లించి నిర్లక్ష్యంగా మాట్లాడుతుంటే లతకు అసహ్యం వేసింది.

"ఎవరండీ అతను? మీకు గుర్తున్నాడా?''

"ఉహు! కానీ పేరు పరిచితంలా ఉంది. రాజయ్య మేష్టారు. రాజయ్య మేష్టారు! ... నువ్వు చూచావా? ఏం మాట్లాడాడు?" ఆమె జవాబుకోసం ఆత్రంతో చూచాడు.

"మీ మేష్టారటకదూ? అదేలెండి వీధిబడిస్టేజీలో. మరట-పాపం, కొడుకు చిన్ననాడే పారిపోయాట్ట! మీ క్లాసేట కదూ? ఏదైనా కబురు మీ ద్వారా తెలుస్తుందేమోనని వచ్చారు."

"ఓ...అదాసంగతి? ఏ దబ్బో-ఏ సిఫారస్సో-ఏ అల్లుడికి కొడుక్కి ఉద్యోగమో అనుకున్నాను. ఈ మారొస్తే ఆఫీస్‌కు పంపమని గూర్ఖాతో చెప్పు" మళ్ళీ సర్దుకుని తల ఆమె ఒడిలో పెట్టుకున్నాడు.

లత హృదయా న్నెవరో అడకత్తెర మధ్య నొక్కినట్లు ఫీలైంది.

పాపం వృద్ధుడు. అతడిపట్ల చూపవలసిన గౌరవం ఇంతేనా? అందునా మేష్టారు, పాపం!

"ఇంకేమైనా చెప్పాడా?"

"ఏముంటుంది చెప్పటానికి. అంతా కన్నీటి కథే! ఎంతమంది లేరలాంటివారు! కళ్లెదుటఉన్న కూతురు చూడదు -కనబడదు. కొడుకు ఒక్కసారి మాయమైపోయాడు. అతడి జీవితమంతా ఈ రెండు అంశాల మధ్య గడుస్తోంది."

సదన్ ముఖంలో దైన్యం కానవచ్చింది!

"కొందరి జీవితాలు ఇలాగే వెళ్ళిపోతుంటాయి లతా! మనచేతుల్లో ఉందా?

ఎంత విచారించినా లాభమేముంది. పాపం-అనుకోవటం తప్ప నొసటిరాత తప్పించగలమా?''

లత ఫకాల్న నవ్వింది. అంతలా ఎందుకు నవ్వుతుందో సదన్‌కి అర్థం కాలేదు. విస్తుపోయి చూస్తున్నాడు. నవ్వుతూనే ఉంది. కానీ కళ్ళలోంచి కన్నీరు లేతచెక్కిళ్లమీదుగా ముత్యాల్లా రాలి పడ్తున్నాయి.

ఒక్క ఊపున సదన్ తలను తీసేసి లేచి నుంచుంది. అతడు ఆమె చర్యకు చకితుడై గ్రుడ్లప్పగించి చూస్తున్నాడు.

"ఏమిటి లతా?" చెయి చాపి అనురాగం రంగరించినట్లు పిల్చాడు.

"ఏమీ లేదు" అంటూ ఒక్కచూపు విసిరి చరచర వెళ్ళిపోయింది.

ఆ చూపు-! విస్ఫులింగాలై అతడి హృదయాన్ని భగ్నంచేసింది. ఆమె చర్యను గ్రహించలేక నిస్సహాయతతో చూస్తూ ఆమెను వెంబడించాడు.

"ఏమిటి లతా. ఎందుకిలా చేస్తున్నావు? నేనేం పొరపాటు చేశాను? అతడికి డబ్బివ్వమంటావా? నీ ఇష్టమొచ్చినంత ఇవ్వు. నేను కాదనను. ఇలా రా." ఆమె చేయి దొరకపుచ్చుకున్నాడు.

లత ఒక్కసారి విదిలించివేసింది. ఛీత్కారంగా మరోచూపు విసరి విసవిసా నడిచిపోతోంది.

"లతా_విదిలిస్తే విదిలించావు, కారణం చెప్పకపోతే నిన్ను వదలను.'' ఈమారు ఆమె రెండుభుజాల్ని గట్టిగా పట్టుకుని తనవైపుకు త్రిప్పుకుని ఆమె కళ్లలోకి తరచి తరచి చూస్తున్నాడు.

మరొకప్పుడైతే— అదొహ ప్రణయ కలాప సన్నివేశమైతే ఆమె చేతులు మెల్లిగా అతడి మెడకు చుట్టుకునేవి. అతడిచేతులు భుజాలమీదుగా జారి ఆమెను గట్టిగా పొదివి పట్టుకునేవి. కాలం స్పందించిపోయినట్లే ఆ హృదయాలు స్పందించేవి. ఆ స్పందన తాలూకు అనిర్వచనీయమైన ఆనందాన్ని గూర్చి ఆ పెదిమలు మత్తుగా మాట్లాడుకునేవి.

కానీ ఈ క్షణంలో ఆమె నిర్లిప్తతతో చూస్తూ మౌనందాల్చింది.

"చెప్పు లతా-అలా మౌనంగా చూడకు" ఆమె భుజాల్ని పట్టుకుని కుదిపేశాడు సదన్. అతడి కళ్లలో క్రోధం తొణికిసలాడుతోంది. పెదిమలు కంపిస్తున్నాయి. అతడి వేడి ఊపిరికి ఆమె ముఖపద్మం కమిలిపోతున్నలా ఉంది.

"చెబుతాను రండి" ఆమె అతడి చేతుల్ని తీసేసి ఒకచెయ్యి పట్టుకుని బాల్కనీమీదికి తీసుకెళ్ళింది.

సదన్ ఒక సోఫాలో కూలబడి ఆమె వైపు తదేకంగా చూస్తున్నాడు.

బాల్కనీ మీదుగా అల్లుకుపోతున్న మాలతీలత సన్నని పరిమళాన్ని వెదజల్లుతుంది. ఆమె ఒక తీవను అందుకుని మత్తుగా ఆఘ్రాణించింది. "ఆరేళ్ళ క్రితం సదన్ - యునైటెడ్ నేషన్స్ ఆవరణంలో మనం కలుసుకున్నాము. రెండుగంటల్లో మంచి స్నేహితులమయ్యాము. నాన్నగార్కి నిన్ను పరిచయం చేశాను. నువ్వు అఖండమైన తెలివిగలవాడవని - ఎంబసీలో పనిజేస్తున్నావని తెలుసుకున్ననాడు, నే నెంతో ఆనందించాను. నెలరోజులు మనం ఏదో ఒక నెపంతో కలుసుకున్నాము. నీ గురించి నాకు తెల్పిన విషయాలవి. నీవు అనాధుడవు. నీ పెదతండ్రి కొన్నాళ్లు చదివించాడు. ఆ తర్వాత స్కాలర్‌షిప్‌తో బి.ఏ. చదివావు. ఆ తర్వాత నీ స్నేహితుల సాయంతో ఎం.ఏ. ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యావు. తర్వాత ఐ.ఎ.ఎస్ పరిక్షలో ఉత్తీర్ణుడవయ్యావు. మీ పెదతండ్రి ఈ మధ్యలో ఎప్పుడో పోయాడు. ఇక నీకెవ్వరూ లేరు. నీ హృదయం అనురాగమయమై ఉండేది. నీ ప్రేమకు పాత్రురాలినా? అని ప్రశ్నించుకోని క్షణం లేదు. తలిదండ్రుల ప్రేమ అంటే ఏమిటో తెలియని నీవు నానించి ఎంతో ఆశించావు. నా ప్రేమను కోరావు. నన్ను భార్యగా పొందాలనుకున్నావు. నా చుట్టూ తిరిగావు. నాన్నగార్కి అమ్మకు ఉత్తరాలు రాశావు. నాన్న నన్ను ఇండియాకు పంపుతుంటే పిచ్చివాడివైపోయినట్లు చూచావు. మాది ఉన్నత కుటుంబం. నీవు సాధారణమైన కుటుంబంలో పుట్టావు. నీ కివ్వటానికి నాన్న కిష్టంలేదు. కాని అతడు తండ్రి. కూతురి హృదయాన్ని అర్థంచేసుకున్న విశాలహృదయాలు అమ్మవి, నాన్నవి. నాన్నకు యునైటెడ్ నేషన్స్‌లో పని అని మరువకు. వెంటనే తన స్నేహితులకు రాసి ఫలానచోట - ఫలానా సుబ్బారావు ఉన్నాడా అని కనుక్కోమన్నారు. వారు కనుక్కొని కేబిల్ పంపారు. "లేడు. చనిపోయి చాలా సంవత్సరాలైపోయింది" అని. నాన్న అది చాలనుకున్నారు. నీ మాటలు విశ్వసించారు. మన పెళ్ళికి సమ్మతించారు. పెళ్ళి చేశారు."

ఆమె వచ్చి సదన్‌కి ఎదురుగా కుర్చీ లాక్కుంది.

"అదంతా అప్రస్తుతం కాదా లతా? అదంతా మధురస్వప్నంగా హృదయంలో సదా నిల్చిఉంటుంది. నిన్ను ఇప్పటికీ అంతగానే ప్రేమిస్తున్నాను. ఆరాధిస్తున్నాను. ఈ హృదయంలో మరో భావనకు చోటులేదు." అతడు ఉద్రేకంతో మాట్లాడుతున్నాడు.

''ఔను అని అంతవరకు నేనూ అనుకున్నాను. నీ హృదయం అమృతమయమని-ప్రేమకు నిలయమని_మంచికి ప్రతిరూపమని-మానవతకు మారుపేరు నీవేనని అనుకుని నిన్ను భర్తగా పొందిన నే నెంత అదృష్టవంతురాలినో అని మురిసిపోయేదాన్ని. ఎన్నిసార్లు

నన్ను నేను మోసపుచ్చుకున్నాను!!" ఆమె తనచేతిలోని సుకుమారమైన మాలతీ లతా పుష్పాన్ని నలిపి నేలకేసి కొట్టింది.



"నువ్వు మోసగాడివి. పయోవిష కుంభానివి. కఠినాత్ముడివి – ప్రేమానురాగాలకు చోటులేని సంకుచిత హృదయం నీది. అసత్యాల పునాదులమీద ఈ మన వైవాహిక జీవితాన్ని నిర్మించావు. నీలోని పాషాణహృదయం ఎటువంటిదో ఇప్పుడే తెలుసుకున్నాను. ప్రాజ్ఞురాలినయ్యాను. నిన్ను భర్తగా పొందినందుకు ..."ఆమె రెండుచేతుల్లో ముఖం దాచుకుంది. వెక్కిళ్ళకు ఎగసిపడ్తోంది హృదయం.

అంత అభాండం మోపినందుకు కోపోద్రేకంతో లేచి నుంచున్నాడు. ఆమె చేతులుతీసి చెంపలమీద పటపట కొట్టాలని చేతులెత్తాడు. కాని తమాయించుకుని ఉద్రేకాన్ని అణుచుకోటానికి ప్రయత్నిస్తున్నాడు.

"ఇక ఈ అబద్ధాల బ్రతుకు చాలించు సదన్–తండ్రిలేడని బొంకావు. కష్టపడి ఎం.ఏ. దాక చదివించాక ఫారిన్ వెళ్ళి, వారిని మర్చిపోయావు. నాతో బొంకావు. ఏనాడో చనిపోయిన పెదతండ్రి పేరు చెప్పి నిజంగా డిప్లొమాట్ అనిపించుకున్నావు. ఇంటికొచ్చిన తండ్రిని గ్రహించలేని మూర్ఖుడవు - అంధుడై పోయావు. వారి దెంతటి హృదయౌన్నత్యం! ఒక్కమారైనా నువ్వు కొడుకువని చెప్పలేదు. నేనే తెలుసుకున్నాను- పులిలా మీదబడే మన టైగర్ అయ్యణ్ణి చూచి తోకాడించింది. ఆ నుదురు...ఆ ముక్కు...ఆమాటలతీరు...అంతామీవే. వెళ్ళి- తోట ఇంట్లో పిల్లలతో ఉన్నారు. కాళ్ళమీదపడి క్షమాపణ కోరుకో. ఆ తర్వాత రా" ఆమె కళ్ళు తెరచిచూచింది. అక్కడ భర్తలేడు. బాల్కనీమీదనించి చూస్తూంది. సదన్ పరుగులమీద తోట ఇంటివైపు వెడుతున్నాడు.

